క్లుప్తంగా

జిల్లెలగూడ శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీని గురువారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 78 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.1 లక్షా 45 వేల 233లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షకుడు మురళీకృష్ణ, మాజీ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్‌ను గురువారం బడంగ్‌పేట మాజీ కార్పొరేటర్లు బంగారు ప్రభాకర్, గౌర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో సర్వే నంబర్ 82లో తప్పుడు పత్రాలతో అక్రమంగా కొందరు బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గురువారం అల్మాస్‌గూడ మాజీ వార్డుసభ్యుడు శేఖర్‌రెడ్డి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్డర్లు నిర్మాణాలు చేపట్టిన ప్లాట్ల నంబర్లు 2ఏ, 2బీ, 2సీలు సర్వే నంబర్ 79లో ఉండగా.. నిర్మాణాలు మాత్రం సర్వే నంబర్ 82లో నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సబ్ రిజిస్ట్రార్లను తప్పుదోవ పట్టించి ఇల్లీగల్ రిజిస్ట్రేషన్ చేయించుకొని బిల్డర్లు ఈ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గత నెలలో ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విన్నవించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ ప్రశాంత్

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఘట్టిగళ్ల చారిట్రబుల్ ట్రస్టు కృషి చేస్తుందని చైర్మన్ ఘట్టిగళ్ల ప్రశాంత్ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యాభివృద్ధికి రూ.10వేల ఆర్థికసాయం ఉపాధ్యాయులకు అందజేశారు. అంతకుముందు హెచ్‌ఎంకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రమౌళి, నాయకులు జంగన్న, రాకేశ్, శ్రీకాంత్, కార్తీక్, ఉపాధ్యాయులు మంగ, రమేశ్, శ్యామల, బాలస్వామి, జంగయ్య, జ్యోతి, చెన్నయ్య పలువురు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ



అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు అందజేస్తున్నామని జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్ అన్నారు. రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులకు గురువారం ఆయన కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎప్పటికప్పుడూ ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు రేషన్‌కార్డుదారులను కూడా పారదర్శకంగా ఎంపిక చేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జహంగీరుద్దీన్, బుడుమాల యాదగిరి, లక్ష్మీనారాయణ, నవీన్‌గౌడ్, బాబు, నవాజ్, శ్రీకాంత్, బబ్లూ, కాంత తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలి

హస్తినాపురం: శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ పైపులైన్లు మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ మేనేజర్ సత్యనారాయణరెడ్డితో కలిసి గురువారం ఆయన కాలనీలోని డ్రైనేజీని వ్యవస్థను పరిశీలించి మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

అద్దె భవనంలో.. ఎస్ఆర్ఓ!

ఆదాయం ఉన్నా ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు

- సౌకర్యాల లేమితో నెట్టుకొస్తున్న వైనం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు
- వాహనాల పార్కింగ్‌కు కష్టాలు
- కార్యాలయ నిర్మాణానికి స్థలం అన్వేషణ

మహేశ్వరం: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే శాఖ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయానికి సొంత భవనం కరువైంది. అరకొర వసతులతో ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు కల్పించుకోలేని స్థితిలో కనాకష్టంగా నెట్టుకువస్తోంది. కనీస అవసరాలు తీర్చుకునేందుకు సరిపడా మూత్రశాలలు లేక ఉద్యోగులు, సిబ్బంది, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇరుకు రోడ్లతో తిప్పలు

మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమే కాదు.. అక్కడికి వెళ్లేందుకు రోడ్డు మార్గం ఇరుకుగా ఉండడంతో రవాణా ఇక్కట్లు ఉన్నాయి. కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్ సౌకర్యం లేదు. వారివారి వాహనాలను తహసీల్దార్‌కు వెళ్లే మార్గంలోని రోడ్డుకు అడ్డంగా, ప్రభుత్వ పాఠశాల ఎదుట, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. చుట్టు పక్కల ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే నిలిపివేస్తున్నారు. దీంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గొడవలకు దారితీస్తోంది.



మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

1200 గజాలు కాదు.. ఎకరా స్థలంలో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు మహేశ్వరం– మహేశ్వరం గేటుకు వెళ్లేదారిలో సిరిగిరిపురం గేటు సమీపంలో రోడ్డు పక్కన రెవెన్యూ సర్వే నంబర్ 113లో నాటి తహసీల్దార్ 1200 గజాల స్థలం కేటాయించారు. అనంతరం ప్రభుత్వం.. నగరానికి దగ్గర్లో ఉన్న కార్యాలయాల్లో సుమారు ఎకరం స్థలంలో అత్యాధునిక హంగులు, సకల సౌకర్యాలతో కూడిన కార్యాలయ నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. దీంతో తొలుత కేటాయించిన స్థలం రద్దు చేసి, ఎకరా భూమి కోసం సబ్ రిజిస్ట్రార్ అధికారులు.. తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అది అక్కడితో ఆగిపోయింది.



రోడ్డుపైన, ప్రైవేట్ స్థలాల్లో వాహనాల పార్కింగ్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ఎకరా స్థలం కావాలని తహసీల్దార్‌కు అర్జీ పెట్టాం. ప్రస్తుత అద్దె కార్యాలయంలో సౌకర్యాల లేమితో ఇబ్బందిగా ఉంది. త్వరలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంను వినియోగించనున్నాం. తగిన విధంగా మరమ్మతులు చేయిస్తున్నాం.

–శ్రీకాంత్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, మహేశ్వరం

అన్వేషిస్తున్నాం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి తగిన స్థలం కోసం అన్వేషిస్తున్నాం. వీలైనంత త్వరగా భూమిని కేటాయిస్తాం. మోడ్రన్ భవనానికి ఎకరా స్థలం కావాలంటే.. గతంలో కేటాయించిన స్థలాన్ని రద్దు చేశాం. కావాల్సిన జాగ కోసం పరిశీలన చేస్తున్నాం. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తిచేస్తాం.

–సైదులు, తహసీల్దార్, మహేశ్వరం

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో పురాతన డ్రైనేజీలను ఆధునీకరించడం ద్వారా వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని మూడుగుళ్ల చౌరస్తా నుంచి ధోబీఘాట్ చౌరస్తా వరకు రూ. 50.77 లక్షల వ్యయంతో నిర్మించనున్న సివరేజీ నిర్మాణ పనులను ఆయన సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్‌లో రూ. 16 లక్షలు, తిరుమలహిల్స్ నుంచి కల్యాణ్‌నగర్ వరకు రూ. 7 లక్షలతో సివరేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. మలకోపేట నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలోనూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, శ్రీనివాస్, ఏఈ వెంకన్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భూమేష్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు.సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సెంటర్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సలహదారులు, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి మహమ్మద్ రఫిఉద్దీన్ ఆధ్వర్యంలో 250 ఔషధ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మన చుట్టూ చెట్లు ఉండడంతో కాలుష్యం తగ్గి మంచి వాతావరణం లభిస్తుందన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు చెట్ల ఆవశ్యకత గురించి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ కసనా నాయక్, ప్రిన్సిపల్ దినేష్, నాయకులు శంకరయ్యగౌడ్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

సైదాబాద్: పరిసరాల పరిశుభ్రతగా ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో గురువారం జీహెచ్ఎంసీ, శానిటేషన్, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన మాన్సూన్ స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. కాలనీలవాసులు తమ ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శానిటేషన్, ఎంటమాలజీ సిబ్బంది డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ మంగతాయారు, శానిటేషన్ డీఈ వెంట్‌రాజు, ఫక్రుద్దీన్, అర్జున్, ఏఈ శిరీష, ఎంటమాలజీ ఏఈ భారతి, యూసీడీ యాదయ్య పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ శ్వేత తదితరులు

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ

చైతన్యపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితీ ఎల్‌బీనగర్ శాఖ ఆధ్వర్యంలో జీహెచ్ఎంజీ ఈస్ట్ జోనల్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా సరూర్‌నగర్ చెరువు నీటిలో పూడికతీత చేపట్టి విగ్రహాలు పూర్తిగా మునిగేలా చేయాలని కోరారు. అలాగే నిమజ్జనానికి తరలివచ్చే మార్గాల్లో రహదారులు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. చెరువు కట్టపై చెత్త ఎప్పటికప్పుడు తరలించే ఏర్పాట్లు, లైటింగ్, తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో నరేష్‌కుమార్, బ్రహ్మచారి, కౌశిక్, లక్ష్మదేవి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఫొటోథెరపీ యూనిట్ల ప్రారంభం

వనస్థలిపురం: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మహేశ్వరం, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో న్యూ బార్న్ స్టాబిలైజేషన్ యూనిట్ (ఎన్‌బీఎస్‌యు)లో డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ రెండు యూనిట్లను గురువారం జీజీహెచ్ మహేశ్వరం సూపరింటెండెంట్ డా.బి.నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు పచ్చకామర్ల నివారణకు ఇవి దోహదపడతాయన్నారు. గతంలో ఉన్న ఫొటోథెరపీ రెండు యూనిట్లు పనిచేయకపోవడంతో ఇప్పటివరకు పిల్లలను నీలోఫర్ ఆసుపత్రికి పంపించేవారమని ఇప్పుడు ఈ సౌకర్యం ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలో ఫిజియోథెరపీ సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.కృష్ణ, ఆర్ఎంఓ డా.జయమాల, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డా.అనిత, గైనిక్ హెచ్‌ఓడీ డా.అనిత, డా.ఉమాశంకర్, డా.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



ఫొటోథెరపీ యూనిట్లను ప్రారంభిస్తున్న డా.నాగేందర్

సమస్యల పరిష్కారానికి వినతి

మన్సూరాబాద్: సింధూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ..సింధూర్ ఎన్‌క్లేవ్ ప్రధాన రహదారి మీదుగా పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయిస్తానని, ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని దూర ప్రాంతాల బస్టాప్‌ను మరోచోటికి తరలించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నేతలకు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు

- సబితారెడ్డికి ప్రొటోకాల్ ఇప్పుడు గుర్తుకొచ్చిందా?
- నియోజకవర్గ అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

మహేశ్వరం: వలస వచ్చిన నేతలకు కుర్చీల కొట్లాట తప్పా మహేశ్వరం అభివృద్ధిపై ధ్యాసలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు టి.యాదిశ్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి వలస వచ్చి ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌లు నియోజకవర్గ అభివృద్ధిని మరిచిపోయి ప్రొటోకాల్ అంటూ కుర్చీల కోసం కొట్లాడుకోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గ ప్రజలు సబితారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇప్పటివరకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా, ప్రజలు ఇబ్బంది పడితే తనకేమిటనే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సబితారెడ్డికి ఎమ్మెల్యేగా బాధ్యత లేదా ప్రశ్నించారు. రేషన్‌కార్డుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించలేదని గగ్గోలు పెడుతున్న సబితారెడ్డి.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీజేపీ చైర్మన్, కౌన్సిలర్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, కాంగ్రెస్ మేయర్‌లకు ప్రొటోకాల్ పాటించకుండా వారిని ఇబ్బందులకు గురిచేసిన రోజులు మరిచిపోయావా సబితమ్మ అని గుర్తుచేశారు. మీ వ్యక్తిగత రాజకీయాల కోసం మహేశ్వరం నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సబితారెడ్డి, కేఎల్లార్‌లకు హితవు పలికారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంపీ నిధుల కింద మహేశ్వరం, కందుకూరు మండలాలకు అభివృద్ధి పనులకు రూ.1.25 కోట్ల నిధులు మంజురయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కోటి 52 లక్షల ఎన్ఆర్‌జీఈఎస్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి శ్రీధర్‌బాబు విడుదల కాకుండా నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బస్వ పాపయ్యగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, పార్లమెంట్ కో–కన్వీనర్ అనంతయ్యగౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్‌యాదవ్, నాయకులు రఘుపతిగౌడ్, శ్రావణ్, పంతునాయక్, శ్రీరాములుయాదవ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతుల్లో రేషన్ కార్డులు

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: రాష్ట్రంలో రేషన్‌కార్డుల మంజూరు పూర్తిగా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆరోపించారు. గురువారం ఆమె సివిల్ సప్లై అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగం చేతులెత్తేసినట్లే కనిపిస్తోందని, ప్రత్యేకించి ఒక వర్గానికి మాత్రమే రెడ్‌కార్పెట్ వేసినట్టు కనిపిస్తోందని అనుమానం వ్యక్తంచేశారు. అసలైన అర్హులు రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని, పేదలకు కార్డులు అందించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఇంతటి సంక్షేమ పథకాన్ని ఓటు బ్యాంకు రాజకీయానికి తాకట్టు పెట్టడం దురదృష్టకరమన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో అర్హులకు రేషన్‌కార్డులు వచ్చేంతవరకు మౌనంగా ఉండలేమని, దళారీ వ్యవస్థను కట్టడి చేసి ప్రజల కోసం పోరాటం చేయడమే తమ ధ్యేయమన్నారు.



సివిల్ సప్లై అధికారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



జాతీయ పతాకంతో బీజేపీ నేతలు

మన్సూరాబాద్: ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా–తిరంగ యాత్ర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 10 నుంచి 15 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రజల్లో దేశభక్తి, జాతీయభావాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీతులసి, బండారి భాస్కర్, కొప్పెర శ్యామల, యశ్పాల్‌గౌడ్, జయప్రకాష్, హరీష్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, గుండె కిరణ్‌కుమార్, జితేందర్ పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంజి సత్తయ్య ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో, సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు సహారా వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకటేశం, సత్యనారాయణ ఉన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

తల్లిపాలు.. బిడ్డలకు మేలు

అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరీ

షాద్‌నగర్: పుట్టిన బిడ్డలకు ఆరునెలల పాటు విధిగా తల్లిపాలు తాగించాలని, దీంతో తల్లీబిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొంగగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే శిశువులకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు టీకాగా పనిచేస్తాయన్నారు. బాలింతలు చిన్నారులకు విధిగా ఆరునెలల పాటు పాలు తాగించాలని, దీంతో తల్లులకు రొమ్ము కేన్సర్, అండాశయ కేన్సర్లు వంటి వ్యాధులు ధరి చేరవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా, విజయ, భారతీ, ప్రమీల, లక్ష్మీ, అలివేలు, సాలి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు ఆరోగ్యం

కొందుర్గు: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టాలని, తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మహదేవ్‌పూర్, ముట్పూర్, బైరంపల్లి, ఉత్తరాసిపల్లి, టేకులపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో రోగనిరోధకశక్తి ఉంటుందని, శివువులకు పోతపాలు పట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, వినోద, అనురాధ, భారతి, పార్వతమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

మొయినాబాద్‌రూరల్: గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల మండల కార్యదర్శి కవిత అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ–2 కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు ఆరోగ్యకరమైనవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు లక్ష్మి, శివరాణి, విజయ, భాస్కర ఆస్పత్రి సిబ్బంది, బాలింతలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కొందుర్గు: ఉత్తరాసిపల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోత్స్న



మొయినాబాద్‌రూరల్: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న టీచర్లు, భాస్కర ఆస్పత్రి సిబ్బంది